# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నిజాం పాలన నుండి హైదరాబాద్ విముక్తి కోసం చేపట్టిన 'ఆపరేషన్ పోలో'లో పాల్గొన్న వీరుల సాహసాన్ని అందరూ గుర్తు చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీమన్ కీ బాత్‌లో పిలుపునిచ్చారు.**

2. **పండుగల సమయంలో 'స్వదేశీ' అన్న మాటను ఏమాత్రం మర్చిపోకూడదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

3. **కలలను నిజం చేసే కర్మ యోగులు ఇంజనీర్లు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**

4. **ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం లభించింది.**

5. **ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.**

==========================

హైదరాబాదు లిబరేషన్ డేని సెప్టెంబరులో జరుపుకుంటున్న తరుణంలో 'ఆపరేషన్ పోలో'లో పాల్గొన్న వీరులందరి సాహసాన్ని గుర్తు చేసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా మన్ కి బాత్, మనసులోని మాట కార్యక్రమం 125వ సంచికలో తన మనసులోని భావాలను ఈ రోజు ఆయన ప్రజలతో పంచుకున్నారు. 1947, ఆగస్టులో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ.. హైదరాబాదులో పరిస్థితి మరోలా ఉండేదని తెలిపారు. నిజామ్, రజాకారుల అత్యాచారాలు రోజురోజుకీ పెరుగుతూ ఉండేవన్నారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించినా, వందేమాతరం అన్నా మృత్యువుని కోరి తెచ్చుకున్నట్లు ఉండేదన్నారు. ఆ సమయంలో బాబా సాహెబ్ అంబేద్కర్ ఇది చాలా పెద్ద సమస్యగా మారుతోందని హెచ్చరించినట్లు ప్రధాన మంత్రి పేర్కొంటూ..

వాయిస్... 20 సెకన్లు

--------------------------

కలలను నిజం చేసే కర్మ యోగులు ఇంజనీర్లని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. మన్ కీ బాత్, మనసులోని మాట 125వ సంచికలో ఈరోజు ఆయన ప్రసంగిస్తూ.. భారతీయ గొప్ప ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి రోజైన సెప్టెంబర్ 15వ తేదీని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. భారతదేశంలోని ఇంజనీర్లు అందరినీ అభినందిస్తూ... వారికి శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

దేశంలో ఎక్కడైతే ఆపద వచ్చిందో, అక్కడ ప్రజలను రక్షించడానికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ఇతర రక్షణ దళాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం పని చేస్తారని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ దళాలు థర్మల్ కెమెరాలు, లైవ్ డిటెక్టర్లు, స్నిఫ్ఫర్ డాగ్స్, డ్రోన్ సర్వైలెన్స్ వంటి అనేక ఆధునిక పరికరాలను సహాయక చర్యలలో ఉపయోగిస్తున్నాయని తెలిపారు. మన్ కీ బాత్, మనసులోని మాట 125వ సంచికలో ఈ రోజు ఆయన ప్రసంగిస్తూ.. ఈ వర్షాకాలంలో ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షలకి గురి చేస్తున్నాయన్నారు. గత కొన్ని వారాలుగా వరదలు, కొండ చరియలు విరిగిపడడం లాంటి పెద్ద విధ్వంసాలను చూస్తున్నామన్నారు. ఈ ఘటనల్లో  కుటుంబ సభ్యులను పోగొట్టుకున్నవారి దు:ఖం మనందరిదీ అయ్యిందని పేర్కొంటూ..

వాయిస్... 30 సెకన్లు

---------------------------

బీహార్‌కు చెందిన దేవకి సోలార్ పంప్‌తో తమ గ్రామ తలరాతనే మార్చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. రతన్ పురా గ్రామంలో నివసించే దేవకిని స్థానికులు ప్రేమతో సోలార్ అక్క అని పిలుస్తారని తెలిపారు. మన్ కీ బాత్, మనసులోని మాట 125వ సంచికలో ఈరోజు ఆయన ప్రసంగిస్తూ.. దేవకికి చిన్న వయసులో వివాహం జరగడం, తక్కువ పొలం, నలుగురు పిల్లల బాధ్యత, భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉండేదన్నారు. స్వయం సహాయక సంఘంలో చేరిన ఆమెకు అక్కడ సోలార్ పంప్ గురించి సమాచారం లభించిందని తెలిపారు. సోలార్ పంప్ ఏర్పాటు చేసి నలభై ఎకరాల కంటే ఎక్కువ భూమికి నీరు అందిస్తున్నారని చెప్పారు. ఇతర రైతులు ఇప్పుడు ఆమెను అనుసరిస్తున్నారని పేర్కొన్నారు.

---------------------------

పండుగల సమయంలో 'స్వదేశీ' అన్న మాటను ఏమాత్రం మర్చిపోకూడదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. దేశంలో తయారైన బహుమతులనే ఇవ్వాలని, దుస్తులనే ధరించాలని, వస్తువులతోనే అలంకరించుకోవాలని సూచించారు. మన్ కీ బాత్, మనసులోని మాట 125వ సంచికలో ఈరోజు ఆయన ప్రసంగిస్తూ.. "వోకల్ ఫర్ లోకల్" ఇదే మన మంత్రం అని పేర్కొన్నారు.  జీవితంలోని ప్రతి అవసరంలోనూ ఉపయోగించే ఎన్నో వస్తువులు ఉన్నాయని, అవి స్వదేశీ వస్తువులే అయి ఉండేలా చూసుకోవాలని పేర్కొంటూ..

వాయిస్.. 20 సెకన్లు

---------------------------

ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ మేరకు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను మంత్రికి పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఆంధ్రప్రదేశ్ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం.. ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేష్‌ను కోరింది. 2001లో ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని  వెల్లడించింది.

---------------------------

మాతా శిశు మరణాలు నివారించేందుకు వైద్యులు చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మాత, శిశు మరణాలపై భీమవరంలో నిన్న నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది జూలై నెలాఖరు వరకూ ఆసుపత్రులలో జరిగిన రెండు మాతృ మరణాలు, నాలుగు శిశుమరణాలపై కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ తల్లి కూడా బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందకూడదని, అదేవిధంగా జన్మించిన ప్రతి బిడ్డ ఆరోగ్యవంతంగా పెరిగేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు.

---------------------------

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. జలజీవన్ మిషన్ పథక పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు నిన్న మంత్రిని విజయనగరం కలెక్టరేట్ లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ పథకం పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టినట్లు చెప్పారు.

కాగా జలజీవన్ మిషన్ అమలు తీరు విజయనగరం జిల్లాలో ప్రశంసనీయంగా ఉందని కేంద్ర బృందం తెలిపింది. జల్ జీవన్ మిషన్ కేంద్ర బృంద సభ్యులు ప్రకాష్ చంద్ర నాయక్, గోకుల్ సేతురాజ్, కె. టి. నాగరాజ్‌లు 5 రోజుల పాటు ఎస్.కోట, దొర్లపాలెం, చీపురుపల్లి మండలం రామలింగాపురం, పుర్రేయవలస తదితర గ్రామాల్లో పర్యటించి పథకం అమలు తీరును పరిశీలించారు.

---------------------------

ఈ – పంట నమోదును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ఈ అంశంపై అన్ని జిల్లాల వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో ఆయన నిన్న శ్రవణ మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చె నెల 30వ తేదీలోగా ఖరీఫ్ సీజన్ ముగుస్తుందన్నారు. ఆలోపు ఈ–పంట నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలకు ఈ–పంట నమోదు వివరాలు ఎంతో కీలకమని వెల్లడించారు. 2 కోట్ల 61 లక్షల భూములకు కేవలం 8 శాతం మాత్రమే నమోదు పూర్తయ్యిందన్నారు. వ్యవసాయేతర, బీడు భూములను కూడా నమోదు చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలోని దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..18 సెకన్లు

=====================